RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 248 | సెప్టెంబర్ 02, 2025 | వెల : రూ.3-00



అయ్యా బాంచన్ రోడ్డు వేయండి

3లో..







# కాళేశ్వరంలో హరీష్‌దే కీ రోల్..

- ఆయన, సంతోష్, మెఘా కృష్ణారెడ్డి వల్లే కేసీఆర్‌కు అవినీతి మరక
- ఈ వయసులో బీఆర్ఎస్ అధినేతపై సీబీఐ ఎంక్వయిరీ ఎందుకు?: కవిత
- తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కామెంట్స్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాట్ టాపిక్‌గా మారారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. గులాబీ పార్టీ లీడర్లు హరీశ్ రావు, సంతోష్‌రావులపై సంచలన కామెంట్స్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో హరీశ్ రావుదే ప్రధాన పాత్ర అని ఆరోపించారు. ఇదే క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

కాళేశ్వరంలో చిన్న భాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయినట్టు చేస్తున్నారు. ఎవరి వల్ల, ఎందుకోసం కేసీఆర్‌కు అవినీతి మరక అంటింది. కేసీఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్ల ఆయనకు చెడ్డపేరు. ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు పాత్ర లేదా?. హరీశ్‌రావు, సంతోష్ వెనుక రేవంత్ రెడ్డి ఉన్నారు. నా తండ్రిపైనే బాణం వేస్తారు. కాళేశ్వరంలో పనిచేసిన ముగ్గురు ఇంజినీర్ల వద్ద వందలకోట్ల సంపద ఉంది. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏమిటీ? లేకపోతే ఏంటీ? కేసీఆర్ దాకా వచ్చాక పార్టీ ఉంటే ఏంటి? పోతే ఏంటీ?' అని వ్యాఖ్యానించారు. మాజీ ఎంపీ సంతోష్ కుమార్, హరీశ్‌రావు, మేఘా ఇంజినీరింగ్ వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు వచ్చిందని కవిత ఆరోపించారు.

**– హరీశ్, సంతోష్ వెనక సీఎం రేవంత్**

కేసీఆర్ జనం కోసం పనిచేస్తే వాళ్లు సొంత ఆస్తులు పెంపు కోసం పని చేశారని మిగతా 3వ పేజీలో..



## కూలిన గోడ.. తప్పిన ప్రమాదం

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తికుంటపల్లి గ్రామంలో జుట్టు పోచయ్యకు చెందిన ఇంటి గోడ కూలింది. ఆ సమయంలో గోడ వద్ద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రస్తుతం వర్షాలకు ఇంటి పైన కవర్ కప్పినప్పటికీ గోడలోకి వర్షం నీరు వెళ్ళటంతో పూర్తిగా నానిపోయి గోడ ఒక్క సారిగా పడిపోయినట్లు పోచయ్య తెలిపారు. దీనిపై స్థానిక పంచాయతీ కార్యదర్శి ని వివరణ కోరగా గతంలో ఒకసారి వర్షాలకు కూలితే దాన్ని బాగు చేపించుకున్నారని, గోడలు నాని ఉండడంతో రెండు రోజుల క్రితం మరోసారి గోడ కూలిందని,ఉన్నతాధికారులకు తెలిపి బాధిత కుటుంబాన్ని పునరావాస కేంద్రానికి తరలిస్తామని తెలిపారు.




## మన బతకమ్మ పోస్టర్ ఆవిష్కరణ

- వరంగల్లో తొలి బతుకమ్మ వేడుకలు స్వాగతనీయం
- టూరిజం శాఖ తొలి బతుకమ్మ వేడుకను విజయవంతం చేస్తాం
- పోస్టర్ ఆవిష్కరణలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ఆడబిడ్డల పోరుగడ్డ... వరంగల్ లో టూరిజం శాఖ ఆధ్వర్యంలో తొలి బతుకమ్మ వేడుకలు నిర్వహించడం స్వాగతనీయమని రాష్ట్ర అటవీ, పర్యావ రణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. రాణిరుద్రమ, సమ్మక్క, సారక్క, చాకలి ఐలమ్మ, హజారే మంగమ్మ వంటి ధీనవ నితలు వచ్చి నేల ఓరుగల్లు అని ఆమె పేర్కొన్నారు. అటువంటి వరంగల్ జిల్లాలో టూరిజం శాఖ నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలను మొదటిసారిగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం ప్రశంసానీయమని చెప్పారు. సోమవారం తన సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, టూరిజం కార్పొరేషన్ ఎండీ వల్లూరి క్రాంతి, సాంస్కృతిక విభాగం సంచాలకులు మామిడి హరికృష్ణ, బతుకమ్మ పండుగ నిర్వాహకురాలు దిల్లీశ్వరి పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మ పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ?పూలతో దేవున్ని కొలిచే ఈ పండుగ ప్రపంచంలో మరెక్కడా లేని ప్రత్యేకత అని చెప్పుకొచ్చారు. ?బతుకమ్మ కేవలం ఒక పండుగ కాదని, ఇది తెలంగాణ ఆత్మగౌరవ వేడుక అని సురేఖ వివరించారు. ?మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండే, సమాజాన్ని, కుటుంబాలను కలిపే పండుగ అని చెప్పారు. ?ప్రకృతి, పర్యావరణం, పూలతో మన బంధాన్ని ప్రతిబింబించేలా సంబరాలు చేస్తామన్నారు. ?ప్రతి తెలంగాణవాసి గుండెల్లో పూల పరిమళంలా నిలిచేలా ఉత్సవం చేస్తామన్నారు. మహిళలకు అత్యంత ప్రత్యేకమైన ఈ పండుగలో, ఎంగిలి పూలతో ప్రారంభించి తొమ్మిది రోజులు తీరొక్క పువ్వుతో బతుకమ్మ పేర్చి ఘనంగా జరుపుకుంటారన్నారు. బాధలను మరిచి, బంధువులతో కలిసి పాటలు పాడుతూ, కోలాటాలు, నృత్యాలతో ఉత్సాహంగా సాగే పండుగ బతుకమ్మ అని అన్నారు. బతుకమ్మ పండుగను పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు.



# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



**వేద న్యూస్, శాయంపేట:**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పై రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శాయంపేట మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి, నాయకులు, కార్యకర్తలు గట్టిగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ , రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఇలాంటి మహానేతపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చేసే విమర్శలు, వ్యక్తిగత దూషణలు తీవ్రంగా ఖండిస్తున్నామని రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య పరిమితులను దాటి, ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. దేశాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలు మేము సహించము అని మండిపడ్డారు. ప్రధానమంత్రి గౌరవాన్ని కాపాడే దిశగా, కాంగ్రెస్ పార్టీ తప్పుదారి పట్టించే రాజకీయాలను నిలువరించే దిశగా బీజేపీ ఉద్యమం కొనసాగుతుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు, మండల ఉపాధ్యక్షులు కోమటి రాజశేఖర్, పోల్ మహేందర్, మండల ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి, మండల కార్యదర్శిలు మేకల సుమన్, జొన్నొత్తుల జీవన్ రెడ్డి, భూత్ అధ్యక్షులు కదారి చంద్రమౌళి, బాసని నవీన్, ముల్కనూరి వెంకటేష్, గొండ శ్రీనివాస్, నాతి విద్యాసాగర్, పున్నం సాంబయ్య, ఎర్ర తిరుపతిరెడ్డి, కొంగరి సుధాకర్, కన్నెబోయిన రమేష్, రాజోజు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కార్మికులకు ఆర్థిక సహాయం



**వేద న్యూస్, కాజీపేట :**

కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో సోమవారం భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల సంఘం సభ్యులు భాష బోయిన కుమారస్వామి, జన్ను కుమారస్వామి పనులు చేస్తూ ప్రమాదవశాత్తు గాయాలు కాగా వారికి సంఘం ఆధ్వర్యంలో ఆసుపత్రి ఖర్చుల కొరకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రమశక్తి అవార్డు గ్రహీత బాస్కె దశరథం పాల్గొని మాట్లాడుతూ కార్మికులకు రావలసిన బెనిఫిట్స్ అన్ని, లేబర్ కానీ కార్మికులు లబ్ధి పొందుతున్నారు, అసలైన కార్మికుడికి ప్రభుత్వ ఫలాలు అందడం లేదు, ఇట్టి విషయంలో ప్రభుత్వము మీ సేవలనుండి లేబర్ కార్డు పథకాన్ని తీసివేసి మరల ఏ ఎల్ వో లకే అప్పజెప్పాలని, నిజమైన కార్మికులకు లబ్ధి చేకూరుతుందని, కార్మికులకు 50 సంవత్సరాలు దాటిన వారికి ప్రభుత్వం పింఛన్ సౌకర్యము కల్పించాలని, ఈఎస్ఐ సౌకర్యము, ఇందిరమ్మ ఇండ్లు కట్టుకొనుటకు గ్రామాలలో ఉన్న భవన నిర్మాణ రంగాల కార్మికులకే ఇవ్వాలని, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులకు ఇవ్వకుదన్నారు. కార్మికులకు అన్యాయం జరుగుతే స్థానిక సంస్థల ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికులు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయరని తెలియజేస్తున్నామన్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో ఉన్న కార్మికులకు ఉపాధి కల్పించాలని, కల్పించని ఎడల కార్మికులు కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో మారబోయిన రాములు, బస్కే భద్రయ్య, నార్లగిరి సుధాకర్, నాయని బాలరాజు, రామకృష్ణ, బస్కే నాగరాజు, పి కుమారస్వామి, సింగారపు రమేష్, రాజు కార్మికులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్ర రాజకీయాలు..!



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోస్ కమీషన్ వేశారని..అది పీసీ ఘోష్ కమీషన్ కాదని..పీసీసీ కమీషన్ అని మాజీ జెడ్పి వైస్ చైర్మన్ సిద్ధం వేణు దుయ్యబట్టారు. ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరు లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిద్ధం వేణు మాట్లాడుతూ సమైక్యాంధ్ర పాలన లో తెలంగాణ ప్రాంతం అంతా ఎడారిగా ఉండేదని 2004 నుంచి 2014 వరకు మధ్యమానేరు ప్రాజెక్టును పదేళ్ళలో పావలా వంతు కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేదని అన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక మధ్యమానేరు ను పూర్తి చేసి భీడుభూములకు సాగునీళ్లు ఇచ్చారని అన్నారు. ఎల్లంపల్లి, మధ్యమానేరు ప్రాజెక్టుల్లో వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే నీళ్లు వస్తాయని, కానీ మెడిగడ్డ వద్ద నిత్యం నీళ్లు ఉండటంతోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కు రూపకల్పన చేశారు.

తెలంగాణ రాష్ట్రంలోని కోటి ఎకరాలకు సాగు నీళ్ళు ఇవ్వాలనే లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టును మూడున్నరేళ్ల కాలంలోనే పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. మేడిగడ్డ బరాజ్ లో రెండు ఫిల్లర్లు కుంగితే మొత్తం.కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది కాంగ్రెస్ ప్రభుత్వం బురద రాజకీయాలు చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ లోని కోటి ఎకరాలకు ఎత్తిపోతల ద్వారా సాగు నీళ్లు ఇస్తే కేసీఆర్ కు పేరు వస్తుందని కుటీల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబు డైరెక్షన్‌లో పని చేస్తున్నారని, ఎన్ని కుట్ర రాజకీయాలు చేసిన, ఎన్ని సీబీఐ దర్యాప్తులు జరిపిన కేసీఆర్ ను ఏం చేయలేరని అన్నారు.

రైతులకు సాగు నీళ్లు ఇస్తే కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డీ సీబీఐ దర్యాప్తు జరుపుతామని మాట్లాడుతున్నారని, సీఎం నియంతల వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. అధికారం ఉందనే అహంకారంతో అడ్డగోలు ఆరోపణలు చేసి తాత్కాలిక ఆనందం పొందుతారు కావచ్చు మీరెన్ని అసత్య ఆరోపణలు, అబద్ధాలు చెప్పిన పడావుబడ్డ భూములు పచ్చబడ్డాయి కాళేశ్వరం పుణ్యాన ఇది మాత్రం తెలంగాణ రైతులకు తెలుసు. గుక్కెడు నీళ్ల కోసం వందల బోర్లు వేసిన నీళ్లు రాక ఆగిన గుండెలకి తెల్సు కాళేశ్వరం ప్రాజెక్టు విలువ. నిజం ఎప్పటికైనా నిలుస్తుంది కాస్త ముందు వెనుక అంతే...తెలంగాణ సాగునీళ్ల అంటే కాళేశ్వరం ప్రాజెక్టు ..కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే కేసీఆర్ అనే నానుడి తెలంగాణ రైతాంగంలో ఉందని మీరు ఎవరు ఎన్ని చేసినా కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయ లేరని తెలంగాణ రైతాంగం ప్రభుత్వంపై తిరగబడే రోజు త్వరలోనే వస్తదని హెచ్చరించారు.

# మహా అన్న దానం ఏర్పాటు అభినందనీయం

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



వినాయక నవరాత్రుల సందర్భంగా మహా అన్న దాన కార్యక్రమం ఏర్పాటు అభినందనీయం అని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. నక్కల గుట్ట సర్కిల్ కార్యాలయం లో హన్మకొండ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వినాయకుని వద్ద కమిషనర్ చే అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కర్రు రమేష్ ఆదిల్ ఖాజా పాషా గొలుసుల సంపత్ దేవేందర్ తోట రాజేష్ తో పాటు ఈ ఈ లు రవికుమార్, సంతోష్ బాబు, మాధవి లత డి ఈ లు కార్తీక్ రెడ్డి,సారంగం ఏ ఈ లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



## –కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే గదికి వెళ్లారు. ఆహార పదార్థాలు సిద్ధం చేస్తుండగా, పరిశీలించారు. అనంతరం 6 నుంచి 10 తరగతి గదుల్లోని విద్యార్థుల ను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తుండగా, పరిశీలించారు. 10 వ తరగతి విద్యార్థులకు ఫిజిక్స్ పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అన్ని సబ్జెక్టుల పాఠ్యాంశాలు నిత్యం చదివించాలని, రాయించాలని సాధన చేయించాలని సూచించారు. విద్యాలయం ఆవరణ నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఆవరణ అంతా మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించాలని సూచించారు.

# విద్యార్థులకు కంటి పరీక్షలు



**వేద న్యూస్, చొప్పదండి :**

లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి ఆధ్వర్యంలో సోమవారం రోజు శరత్ మ్యాక్స్ విజన్ కరీంనగర్ వారి సౌజన్యంతో కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్, ఎక్సలెంట్ హై స్కూల్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందు లో 100 మందికి పరీక్షలు నిర్వహించగా 30 మందికి కళ్ళద్దాలు అవసరం అని తెలిపారు. వీరిని తదుపరి పరీక్షలకై హాస్పిటల్ కి రెఫెర్ చేసారు. వీరిని శరత్ మ్యాక్స్ విజన్ హాస్పిటల్ ఆప్తమాలజిస్ట్ అజయ్ మరియు కో ఆర్డినేటర్ నవీన్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన రీజియన్ చైర్మన్ కొల్లూరి జితేందర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం తప్పనిసరి ఎందుకంటే వారు చదువుకునే వయసులో స్మార్ట్ ఫోన్లు వాడుతుండటం వలన కంటి చూపు దెబ్బ తింటుంది. కానీ వారికి ఆ విషయం పై అవగాహన ఉండదని అవగాహన కల్పించేందుకు చొప్పదండి లయన్స్ క్లబ్ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా క్లబ్ కార్యవర్గం కు మరియు ప్రోగ్రామ్ చైర్మన్ మామిడి రాజేష్ పవార్ లకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు తొడుపునూరి సత్యనారాయణ, కార్యదర్శి సిరిపురం రాజు, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ పెద్ది లక్ష్మీకాంతం, మహేశుని మల్లేశం, సభ్యులు ఇప్పనపల్లి రాజేశం, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై

# పోలీసులు ఉక్కుపాదం



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ చౌరస్తా వద్ద సోమవారం ఉదయం అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్కె. షబ్బీర్ హుస్సేన్ హెడ్ కానిస్టేబుల్ తో కలిసి ఉదయం 6.30 గంటలకు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, అనుమతులు లేకుండా ఇసుక లోడ్ తో వస్తున్న ట్రాక్టర్ ను ఆపి తనిఖీ చేశారు. డ్రైవర్‌గా ఉన్న వ్యక్తి ఆలకుంట శివ (19) వడ్డెర తిమ్మాపూర్ గ్రామానికి చెందినవాడు. అతను ఎలాంటి అనుమతి పత్రాలు చూపించలేకపోవడంతో పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్కు తరలించారు. అనంతరం ఎస్సై కె. రాహుల్ రెడ్డి కేసు నమోదు చేసి, డ్రైవర్‌ను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ 14 రోజుల న్యాయ రిమాండ్ కు పంపించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# 'కాళేశ్వరం'లో హరీశ్‌దే కీ రోల్



ఆమె మండిపడ్డారు. హరీశ్‌రావు, సంతోష్ తనపై ఎన్నో సార్లు కుట్రలు చేశారని కవిత ఆరోపించారు. తనపై ఎన్ని కుట్రలు చేసినా ఏం మాట్లాడినా నోరు మెదపలేదని, కానీ ఈరోజు కేసీఆర్ బిడ్డగా ఎంతో బాధపడుతున్నట్లు తెలిపారు. హరీశ్‌రావు, సంతోష్ వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని కవిత విమర్శించారు. రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు, సంతోష్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని విమర్శించారు. హరీశ్‌రావు, సంతోష్‌ను రేవంత్ ఏమీ అనరని, తన తండ్రిపైనే బాణం వేస్తారని అన్నారు. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏమిటీ? లేకపోతే ఏంటీ? కేసీఆర్ దాకా వచ్చాక పార్టీ ఉంటే ఏంటి? పోతే ఏంటీ? ప్రశ్నించారు. ఇది తన తండ్రి పరువుకు సంబంధించిందని అన్నారు. తన లేఖ బయటకు వచ్చినా తాను ఎవరి పేర్లు బయటపెట్టలేదని స్పష్టం చేశారు.

**– డబ్బులపై కేసీఆర్‌కు ఆశలేదు**

రేవంత్ రెడ్డి ఫ్రిప్లాన్‌డ్‌గా సీబీఐ పేరు చెప్పారని, తాము కచ్చితంగా నిజాం బాటలోనే నడుస్తామని అన్నారు. నిజాం కట్టిన నిజాంసాగర్ నీళ్లే కదా మనం తాగుతున్నామని, కేసీఆర్‌పై సీబీఐ విచారణకు కారణం హరీశ్‌రావు, సంతోష్ అని విమర్శించారు. ఈ వయసులో కేసీఆర్ సీబీఐ విచారణ ఎందుకు ఎదుర్కోవాలని ప్రశ్నించారు. హరీశ్‌రావు, సంతోష్ తనపై ఎన్ని కుట్రలు చేసినా భరించానని, తనపై వ్యక్తిగతంగా దాడులు చేసినా వాళ్ల పేర్లు ఎప్పుడూ చెప్పలేదని, తన మాటల వల్ల బీఆర్ఎస్ శ్రేణులకు కోపం రావొచ్చని తెలిపారు. అప్పుడప్పుడూ వాస్తవాలు మాట్లాడుకుని మందు తీసుకుంటేనే ఆరోగ్యానికి మంచిదని చెప్పారు. కేసీఆర్ రాజకీయాల్లో ఇన్నేళ్లు ఉన్నా ఆస్తులు సంపాదించుకోలేదని, డబ్బులపై కేసీఆర్‌కు ఏనాడు ఆశ లేదని పేర్కొన్నారు.

కాళేశ్వరంలో పనిచేసిన ముగ్గురు ఇంజినీర్ల వద్ద వందలకోట్ల సంపద ఉందని, కాళేశ్వరం ఇంజినీర్ల ఆస్తులపై ఎందుకు విచారణ జరిపించట్లేదని, ఏసీబీకి చిక్కిన ఇంజినీర్ల వెనుక ఎవరున్నారో ఎందుకు విచారణ చేయట్లేదని కవిత నిలదీశారు. బీఆర్ఎస్‌ను ఇబ్బందులకు గురిచేసిన అవినీతి అనకొండలను ఉపేక్షించొద్దని కోరారు. హరీశ్‌రావు, సంతోష్ వెనుక రేవంత్‌రెడ్డి ఉన్నారని, కాపాడుతున్నారని, వాళ్ల సోషల్ మీడియా బ్యాచ్ రేపట్నుంచి తనపై దుష్ప్రచారం చేస్తారని, సోషల్ మీడియాలో తనపై నరకం చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు కేసీఆర్ అంటే మహానాయకుడు అని దేశవ్యాప్త పేరు ఉందని, రేపట్నుంచి కేసీఆర్ పేరు చెబితే సీబీఐ పేరు కూడా వినిపిస్తుందని, పెద్దసార్ వద్దకు వచ్చాక కాంప్రమైజ్ అయ్యే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. తనని రేవంత్‌రెడ్డి, బీజేపీ, బండి సంజయ్ నడిపిస్తున్నారని రేపట్నుంచి అంటారని జోస్యం చెప్పారు. తాను కేసీఆర్ బిడ్డను అని, ఒకరు నడిపిస్తే నడిచే వ్యక్తిని కాదని, ఖబడ్దార్ అని హెచ్చరించారు.

# అయ్యా బాంచన్ రోడ్డు వేయండి

**- రోడ్డు కోసం రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు - ఎస్సై కాళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు..!**

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని పంగిడిపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులంతా తమ గ్రామానికి రోడ్డును వేయాలని కోరుతూ సోమవారం కమలాపూర్ మండల కేంద్రంలోని పంగిడిపల్లి క్రాస్ వద్ద హుజురాబాద్ – పరకాల ప్రధాన రహదారిపై బైఠాయించారు. కమలాపూర్ మండల కేంద్రం నుండి పంగిడిపల్లి గ్రామం వరకు రోడ్డు మొత్తం గుంతల మయంగా మారిందని, తమ గ్రామానికి వెళ్లాలంటే నిత్యం నరకయాతన అనుభవిస్తున్నామని, తమ గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయానికి సంబంధించిన అవసరాల కోసం నిత్యం కమలాపూర్ కు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ఈ దెబ్బతిన్న రోడ్డు వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమకు ఆపదొచ్చి అంబులెన్స్ కు ఫోన్ చేస్తే పూర్తిగా ధ్వంసమైన ఈ రోడ్డు వల్ల అంబులెన్స్ కూడా సమయానికి రాలేని పరిస్థితి ఏర్పడిందని ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సమస్యలు ఉన్నాయని రోడ్డు వేయాలని గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నిసార్లు వేడుకున్న తమ గోడును ఎవరు పట్టించుకోవట్లేదు అని రోడ్డు వేసే వరకు కూడా తాము ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. కమలాపూర్ ఎస్సై వీరభద్ర రావు వచ్చి గ్రామస్తులకు నచ్చజెప్పిన కూడా ఎంతకూ వారు వినకపోవడంతో కమలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, తహసిల్దార్ కి సంబంధిత సమస్యపై సమాచారం తెలియజేయడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంగిడిపల్లి రోడ్డుకు సంబంధించి కాంట్రాక్టర్ తో మాట్లాడానని వర్షాలు కొంచెం తగ్గుముఖం పట్టిన తర్వాత రెండు రోజుల్లో పని ప్రారంభిస్తానని చెప్పినట్లు గ్రామస్థులతో తెలిపారు. పంగిడిపల్లి గ్రామస్తులు ఎంపీడీవో,



తహసిల్దార్, ఎస్సై ముందే కాంట్రాక్టర్ కు ఫోన్ చేసి అధికారులతో మాట్లాడించారు. అధికారుల నుంచి కాంట్రాక్టర్ నుంచి హామీ తీసుకున్న తర్వాతే గ్రామస్తులు శాంతించారు. రెండు రోజుల్లో తిరిగి పని ప్రారంభించక పోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపారు.

# ఎస్ఆర్ డీజీ స్కూల్ లో ఎన్ సిసి అవగాహన

**వేద న్యూస్, కరీంనగర్ :**

పట్టణంలోని ఎస్ ఆర్ డీజీ స్కూల్లో సోమవారం ఎన్ సి సి అవగాహన కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్ సి సి ఫస్ట్ లేడీ క్యాప్టన్, 9 వ బెటాలియన్ కిరణ్ జ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్ సి సి యొక్క విశిష్టతను, తెలియజేసారు. విద్యార్థులు ఎన్ సి సి లో జాయిన్ అవడం వలన వారిలో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా స్కూల్స్ జోనల్ ఇంచార్జ్ శశిధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ తో పాటుగా మంచి లక్ష్యాన్ని చేరుకుని ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు అని అన్నారు. అనంతరం ప్రిన్సిపల్ మానస మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఎన్ సి సి చాలా ఉపయోగకరం అన్నారు. ఈ కార్యక్రమములో ఎన్ సి సి కాడెట్స్ పరేడ్ నిర్వహించారు. ఇట్టి కార్యక్రమములో ఇంచార్జ్ లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపీఎస్.తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 32 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే




ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# వనం వీడి జనంలోకి కోతులు..!



**వేద న్యూస్, పెద్దపల్లి :**

పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం పలు గ్రామంలో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. గ్రామపంచాయతీ సిబ్బంది మరియు అధికారులు కోతుల బెడద నివారించడంలో విఫలమయ్యారని చెప్పుకోవచ్చు. గతంలో కోతులు గాయపరిచిన సంఘటన వల్ల ఆసుపత్రి పాలైన బాధితులు అనేకం. అయినా కూడా ప్రజల భద్రత దృష్ట్యా అధికారులు నివారణ చర్యలు తీసుకోకపోవడం దేనికి సంకేతం అని సందేహాలు ఏర్పడుతున్నాయి. కోతుల బాధతో విద్యార్థులను ఒంటరిగా స్కూలుకు పంపాలన్న కూడా విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రజలు రోడ్లపై నడవాలన్న కూడా ఈ కోతుల భయంతో గ్రామస్తులు జంకుతున్నారు. రోడ్డుపై వెళ్లే వాహనదారులను కూడా కోతులు వదలడం లేదు. ఇండ్లలోకి కూడా చొరబడి సామాన్లు చిందర వందరంతో పాటు ఇంటి పై కప్పులును ధ్వసం చేస్తు నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని నివారణ చర్యలు చేపట్టాలని పలు గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# సీపీఎస్ విధానం రద్దు చేయాలి



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్రంలో 2004 సెప్టెంబర్ నుంచి నియమితులైన ఉద్యోగ ఉపాధ్యాయులకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని టిటియు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు కొండికొప్పుల రవి డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల అర్బన్ చంద్రంపేట ఉన్నత పాఠశాలలో బోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం కలిగించేలా ఉన్న 653,654,655 ఉత్తర్వులను రద్దు చేయాలని పేర్కొన్నారు. త్రిపుర, పశ్చిమ బెంగాల్,కేరళ రాష్ట్రాల మాదిరిగా తెలంగాణ లోను పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయుల ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఏం. ఏ ఖాద్రీ,పాఠశాల ఉపాధ్యాయులు కైరి పద్మ, గువలకొండ .శ్రీనివాస్, వోద్యారంమధుసూదన్, రమా,మిరియం, పద్మజ, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కుంకుమ పూజ



**వేదన్యూస్, వీర్నపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో హనుమాన్ నగర్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక విగ్రహం వద్ద సోమవారం మహిళలు కుంకుమ పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, గణనాధుని ఆశీస్సులు పొందారు .అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గణనాథుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మండప నిర్వాహకులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నిరంతరం ఈ వినాయక విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నామని ప్రతి సంవత్సరం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు.

వేద న్యూస్

మంగళవారం సెప్టెంబర్ 02, 2025

## నెక్కొండను మున్సిపాలిటీగా ప్రకటించాలి



**వేద న్యూస్, నెక్కొండ :**

నెక్కొండ మండలం నర్సంపేట నియోజకవర్గంలోనే ఏకైక రైల్వే స్టేషన్ ఉన్న మండలం. వరంగల్ జిల్లాలోని అతిపెద్ద మండలం నెక్కొండ అయినప్పటికీ నెక్కొండ పట్టణం మున్సిపాలిటీ కావడానికి అన్ని అర్హతలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం నెక్కొండను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని హైదరాబాదులో నేడు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. గతంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ప్రతిపాదనలు పంపిన నెక్కొండ పట్టణాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయలేదని ఇప్పటికైనా ముఖ్యమంత్రి ని ఒప్పించి ఏర్పాటు చేయాలని మంత్రి ని కోరారు.

## మాంట్‌ఫోర్ట్ పాఠశాలలో ఘనంగా ఫ్రూట్స్ డే, వెండర్స్ డేలి




**వేద న్యూస్, హన్మకొండ:**

మాంట్‌ఫోర్ట్ పాఠశాల తమ విద్యార్థులను ఆనందంగా, అర్థవంతంగా మరియు చేతితో చేసుకుంటూ నేర్చుకునే విధంగా సమగ్ర విద్యపై దృష్టి పెట్టి, రోజువారీ జీవితంలోని చిన్న చిన్న విషయాలను అర్థం చేసుకొని వాటి విలువను గుర్తించేలా విద్యార్థులను సిద్ధం చేస్తోందని పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ జి.విన్సెంట్ రెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ పి.లూర్దు రాజ్ ఆధ్వర్యంలో మాంట్‌ఫోర్ట్ పాఠశాల నర్సరీ, ఎల్ కేజీ మరియు యూకేజీ విద్యార్థులు ఏర్పాటుచేసిన ఫ్రూట్స్ డే మరియు వెండర్స్ డే కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఫ్రూట్స్ డే లో వివిధ పండ్లను గుర్తించి, వాటి పోషక విలువలు మరియు ప్రాధాన్యత గురించి విద్యార్థులు వివరించారు.

యూకేజీ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన వెండర్స్ డేలో విద్యార్థులు వ్యాపారుల పాత్రను పోషించి, మన రోజువారీ జీవితంలో వ్యాపారుల ప్రాముఖ్యతను చూపించి, కూరగాయల గురించి విద్యార్థులు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ జి.విన్సెంట్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మరియు ఆటలు విద్యార్థులు అనుభవం ద్వారా స్వతంత్రంగా నేర్చుకోవడానికి ప్రోత్సహించడమే కాకుండా సిద్ధాంతం మరియు ప్రాక్టికల్ అనుభవాన్ని మిళితం చేస్తుందన్నారు. పిల్లలు కూరగాయలు, పండ్ల ప్రాధాన్యతను అర్థం చేసుకోవడమే కాకుండా, ఆత్మవిశ్వాసం మరియు కమ్యూనికేషన్



నైపుణ్యాలను పెంపొందించుకుంటారని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీన్ బాను, గ్రేస్, రీటా, డొమినికా, వినీషా, శిల్పా మరియు కవిత, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు ఆరెంజ్ అలెర్ట్ జారీ

### – ఈశాన్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం సగటున సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్లు

**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణలో రాగల నాలుగురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈశాన్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం సగటున సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి వైపునకు వంగి ఉందని.. దాని ప్రభావంతో రాబోయే 24గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తర ఒడిశా తీర ప్రాంతం, వాయువ్య బంగాళాఖాతంలో సగటున సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల విస్తరించి ఉందని.. మయన్మార్ తీరం నుంచి ఉత్తర ఒడిశా వరకు ఉన్న ద్రోణితో కలిసిపోయిందని వాతావరణశాఖ వివరించింది. ఈ క్రమంలో తెలంగాణలో సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆయా జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, హన్మకొండ, జగిత్యాల, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంటూ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. మంగళవారం కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, నిర్మల్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. జనగాం, ఆదిలాబాద్, కామారెడ్డి,



జనగాం, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నల్గొండ, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. బుధవారం కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడుతాయని అంచనా వేసింది. ఆదిలాబాద్, హన్మకొండ, కామారెడ్డి, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలుంటాయని హెచ్చరించింది. ఈ నెల 4న రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, కామారెడ్డి, పెద్దపల్లి, మంచిర్యాల, వరంగల్, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ములుగు జిల్లా ఏటూరునాగారంలో 11.7, కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో 15, కొత్తగూడెంలో 19.2, నాగుపల్లెలో 12, మహమూబాబాద్ జిల్లా భూపతిపేటలో 11.9 సెంటీమీటర్ల భారీ వర్షపాతం రికార్డయ్యిందని టీజీ డీపీఎస్ వివరించింది.

## నిమజ్జనానికి వెళ్లి ప్రాణాలు కోల్పోయిన తండ్రీ కుమారులు


- ఉదయం వరకూ గుర్తించలేకపోయిన స్థానికులు
- సైబరాబాద్ కమిషనరేట్ దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన
- వినాయక నిమజ్జనానికి వెళ్లి వెనక్కి తిప్పే క్రమంలో చెరువులో పడిన ట్రాలీ ఆటో

**వేద న్యూస్ డెస్క్:**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విషాద ఘటన చోటుచేసుకుంది. వినాయక నిమజ్జనానికి వెళ్లిన తండ్రి, కొడుకు విగత జీవులుగా మారారు. దుండిగల్ మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం వల్లే రెండు నిండు ప్రాణాలు పోయాయని, వినాయక నిమజ్జనానికి చెరువు వద్ద కనీసం ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దుండిగల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ ట్రాలీ ఆటోలో కూరగాయలు అమ్ముకుంటూ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీనివాస్‌కు 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అతనికి ముగ్గురు సంతానం. కాగా అందులో పెద్ద కుమారుడు జాన్ వెస్లి. ఆదివారం రాత్రి వినాయక నిమజ్జనానం కోసం విగ్రహాన్ని తరలించేందుకు కిరాయి మాట్లాడుకున్నారు. ఈ నిమజ్జనానికి తనతో పాటు తన కుమారుడు జాన్ వెస్లీని కూడా తీసుకువెళ్లాడు. రాత్రి దుండిగల్ మోతి చెరువులో నిమజ్జనం చేసి ఆటోను వెనక్కి తిప్పే క్రమంలో ఆటో ప్రమాదవసాత్తు చెరువులోకి దూసుకెళ్లింది. ఆటో కనిపించకపోయేసరికి అందరూ ఇంటికి వెళ్లిపోయారని అనుకుని ఊరికి వెళ్లారు. ఉదయం కావస్తున్నా తండ్రీ కుమారులు ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల వారికి అనుమానం వచ్చింది. దీంతో వారు చెరువు వద్దకి వెళ్లి చూడగా వారికి ఎవరూ కనిపించకపోవడంతో ఆటో చెరువులోనే పడిపోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు, డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చెరువులో 3 గంటలు గాలింపు చర్యలు చేపట్టారు. చివరిగా ఆటోను బయటకు తీశారు. ఈ ఆటోలో శ్రీనివాస్ (35), అతని కుమారుడు జాన్ వెస్లీ (7) విగత జీవులై కనిపించారు. ప్రమాదం జరిగే సమయంలో ఆటో డోర్ తెరుచుకోకపోవడం కారణంగా నీటిలో మునిగి, ఊపిరి ఆడక ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని ఆదేశించలేం




**వేద న్యూస్ డెస్క్:**

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణను నిలిపివేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా తమపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని ఆదేశించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు. అయితే, ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టడానికి, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి హైకోర్టు నిరాకరించింది ఈ పిటిషన్‌ను సాధారణ కేసుల మాదిరిగానే విచారిస్తామని న్యాయస్థానం స్పష్టం చేసింది. రేపు ఉదయం 10.30 గంటలకు విచారణ చేపడతామని తెలిపింది. అప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వలేమని కూడా కోర్టు తేల్చి చెప్పింది. విచారణ సందర్భంగా ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత తదుపరి నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపిస్తామని అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై సుదీర్ఘ చర్చ అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ఇతర రాష్ట్రాల ప్రమేయం ఉన్నందున, సీబీఐ విచారణే సరైనదని ప్రభుత్వం అభిప్రాయపడింది. అసెంబ్లీ తీర్మానం చేసిన మరుసటి రోజే (ఈరోజు) కేసీఆర్, హరీశ్ రావు హైకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో రేపు జరగనున్న హైకోర్టు విచారణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## వెంటనే సీబీఐ విచారణకు లేఖ పంపండి

### – కాళేశ్వరంపై బీజేపీ వైఖరే సరైందని రుజువైందన్న బండి సంజయ్

**వేద న్యూస్ డెస్క్:**

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై తమ పార్టీ బీజేపీ మొదటి నుంచి అనుసరిస్తున్న వైఖరే సరైందని మరోసారి స్పష్టమైందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు బీఆర్ఎస్ పూర్తి బాధ్యత వహించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈరోజు ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం అవినీతిపై తాము మొదటి నుంచి సీబీఐ విచారణ కోరుతున్నామని గుర్తుచేశారు. అయితే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను కాపాడే ఉద్దేశంతోనే ఇన్నాళ్లూ చర్యలు తీసుకోవడంలో జాప్యం చేసిందని ఆరోపించారు. "ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిజానికి తలవంచి, ఈ కేసును సీబీఐకి అప్పగించేందుకు అంగీకరించింది. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సీబీఐకి లేఖ పంపాలి" అని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును విమర్శిస్తూ, గతంలో ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) టోల్ టెండర్ల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం సిట్‌ను ప్రకటించిందని, కానీ నేటికీ అది కార్యరూపం దాల్చలేదని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కూడా ఒక డైలీ సీరియల్‌లా కొనసాగుతోందని ఆయన విమర్శించారు. కాళేశ్వరం విషయంలో ఇంత జరిగాక, బీఆర్ఎస్ నైతిక బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073